# అభివృద్ధిని చూసి ఆదరించాలి

- ప్రభుత్వ విప్ బాల్క సుమన్
- బతుకమ్మ చీరలు, క్రీడా కిట్ల పంపిణీ



చెన్నూర్ రూరల్ : బతుకమ్మలతో ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

చెన్నూర్ రూరల్, అక్టోబర్ 5: చెన్నూర్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి బీఆర్ఎస్‌ను ఆదరించాలని చెన్నూర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అదనపు కలెక్టర్ రాహుల్, తెలంగాణ క్రీడా ప్రాధికారిక చైర్మన్ ఆంజనేయ గౌడ్‌తో కలిసి సద్దుల బతుకమ్మ చీరెలతో పాటు క్రీడాకారులకు క్రీడా కిట్లను పంపిణీ చేశారు. చెన్నూర్‌ను రెవెన్యూ డివిజన్ ప్రకటించిన తర్వాత చెన్నూర్‌కు వచ్చిన విప్ సుమన్‌కు మహిళలు బతుకమ్మలతో స్వాగతం పలికారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బాల్క సుమన్ మాట్లాడుతూ... 60 ఏండ్ల కాంగ్రెస్, టీడీపీ పాలనలో అభివృద్ధి అంటే ఎంటో తెలువని పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ప్రతి మండలంలో జరుగుతున్న అభివృద్ధి మన కండ్ల ముందే కనిపిస్తున్నదని తెలిపారు. కాంగ్రెకు ఓటు వేస్తే మన ఇంట్లో మన కరెంట్ స్విచ్ మనమే బంద్ చేసుకున్నట్లు అవుతుందని అన్నారు. అభివృద్ధి అంటే ఒక్క ఊరిలో సీసీ రోడ్డు మంజూరు చేయడం కాదని, ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించడమని తెలిపారు. సీఎం సహకారంతో ఒక్క చెన్నూర్ పట్టణంలోనే చూసుకుంటే, సెంట్రల్ లైటింగ్, కేసీఆర్ పార్కు, మినీ ట్యాంక్ బండ్, బస్ డిపో, కూరగాయల మార్కెట్, 100 పడకల దవాఖాన, 50 పడకల మాతా శిశు దవాఖాన, సమ్మక్క-సారలమ్మ మహిళా భవనం, అంబేద్కర్ అర్బన్ పార్కుతో పాటు పలు అభివృద్ధి పనులను చేపట్టినట్లు పేర్కొన్నారు. చెన్నూర్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులతో పాటు సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ నాయకులు, కార్యకర్తలు తీసుకుపోవాలని బీఆర్ఎస్ నాయకులకు పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో చెన్నూర్ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయడంతో పాటు చెన్నూర్ మండలంలోని ఆస్నాద్, కోటపల్లి మండలంలోని పారిపల్లి గ్రామాలను మండలాలుగా ఏర్పాటు చేస్తున్నట్లు జీవో ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. 2016 సంవత్సరం నుంచి రెవెన్యూ డివిజన్ కోసం కాంగ్రెస్, బీజేపీ నాయకులు దొంగ దీక్షలు, తప్పుడు ప్రచారాలు చేశారని అన్నారు. త్వరలోనే రెండు మండలాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని విప్ తెలిపారు. రాష్ట్రంలో బతుకమ్మ చీరెలను పంపిణీ చేయడం ఇది 7వ సారి అని అన్నారు. ప్రతి మహిళకూ బతుకమ్మ చీర అందించే విధంగా చూడాలని అధికారులను విప్ ఆదేశించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడా ప్రాంగణాల ఏర్పాటుతో పాటు, స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ ఎంపీపీ మంత్రి బాపు, జడ్పీటీసీ మోతె తిరుపతి, మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనా గిల్డా, వైస్ చైర్మన్ నవాజ్, వైస్ ఎంపీపీ వెన్నపురెడ్డి బాపు రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెల దామోదర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తుల సమ్మయ్య, పీఏసీఎస్ చైర్మన్ చల్ల రాంరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చెన్నూర్ రూపురేఖలు మారాయి..



మాట్లాడుతున్న క్రీడా పాధికారిక చైర్మన్ ఆంజనేయ గౌడ్

చెన్నూర్ రూరల్, అక్టోబర్ 5:చెన్నూర్‌లో జరుగుతున్న అభివృద్ధి, జరిగిన అభివృద్ధి కండ్ల ముందు కనిపిస్తుంది అని తెలంగాణ క్రీడా పాధికారిక చైర్మన్ ఆంజనేయ గౌడ్ అన్నారు. చెన్నూర్‌కు నేను 15 సంవత్సరాల క్రితం వచ్చానని, ఆపుట్టి చెన్నూర్ ఇప్పుడున్న చెన్నూర్‌కు చాలా తేడ కనిపిస్తుందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో వ్యవసాయం లేక రైతులు, మెరుగైన వైద్యం అందక పేద ప్రజలు ఎంతో మంది చనిపోయారని గుర్తు చేశారు. మన బతుకులు మార్చాలని కొట్లాడి, పోరాటం చేసిన మనిషి కేసీఆర్ అని పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడ్డాక రైతంగానికి పెద్ద పీట వేశారని, నిరుపేదలకు అనేక సంక్షేమ పథకాలను అందించారని తెలిపారు. అలాంటి సీఎం మనం మూడవ సారి సీఎంగా అసెంబ్లీకి పంపించాలని ఆయన సూచించారు. మీ ఊర్లోకి వచ్చే బీజేపీ, కాంగ్రేస్ నాయకుల మాటలను ఎట్టి పరిస్థితులలో నమ్మవద్దని అన్నారు. కులవృత్తులు అంత ఒక్కదాటిపై వచ్చి తీర్మాణాలు చేయాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో బాల్క సుమన్‌ను ఎమ్మెల్యేగా మంచి మెజారిటీ గెలిపించి మంత్రి పదవికి పంపాలని, చెన్నూర్ నియోజకవర్గాన్ని సిద్దిపేట, సిరిసిల్ల మాదిరిగా అభివృద్ధి చేసుకోవాలని ఆయన ప్రజలకు తెలిపారు.



చెన్నూర్ టౌన్ : మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని అందిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

## అభివృద్ధి యజ్ఞంలో భాగస్వాములవ్వాలి

చెన్నూర్ టౌన్, అక్టోబర్ 5 : నియోజకవర్గంలోని మున్సిపాలిటీల్లో శాఖల వారీగా అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నామని, మినీ ట్యాంక్ బండ్‌లు, బైపాస్ రోడ్లు, లైబ్రరీ, హాస్పిటల్, బస్ డిపో, రోడ్డు వెడల్పు పనులు, సెంట్రల్ లైటింగ్, పార్కులు, మహిళాభవన్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ వంటి పనులతో ప్రణాళికంగా ముందుకెళ్తున్నామని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ చెప్పారు. మిగిలిన పనులు కూడా పూర్తి చేసుకుందామన్నారు. చెన్నూర్ పట్టణంలోని కోర్టు సముదాయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌కే తమ మద్దతు తెలుపుతున్నట్లు ఏకగ్రీవంగా తీర్మానించారు. అందుకు సంబంధించిన పత్రాన్ని బార్ అసోసియేసన్ తరపున అందించారు. పరిపాలన సౌలభ్యం కోసం చెన్నూర్‌ను రెవెన్యూ డివిజన్, ఆస్నాద్, పార్‌పల్లిలను మండలాలను చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరడంతో అందుకనుగుణంగా జీవో రావడం సంతోషంగా ఉందన్నారు. చెన్నూర్‌లో రెండు రోజుల్లో రూ.55 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించుకోనున్నామని చెప్పారు. 55 ఏండ్లలో చెన్నూర్ నియోజకవర్గాన్ని ఎవరూ పట్టించుకోలేదని, ప్రస్తుతం ఏకకాలంలో ఏకోన్ముఖంగా కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. కేంద్రం సహకారం లేకున్నా, పెద్ద నోట్ల రద్దు, కరోనాతో ఇబ్బందులు పడ్డా పనులన్నీ పూర్తి చేసుకుంటూ ప్రగతిపథంలో కొనసాగుతున్నామన్నారు. అభివృద్ధి యజ్ఞం ముందుకు సాగాలంటే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మద్దతు తెలపాలని న్యాయవాదులను కోరారు. భారత దేశంలోనే జర్నలిస్టుల సంక్షేమం కోసం వంద కోట్ల రూపాయలు, అడ్వకేట్ల సంక్షేమం కోసం రూ.వంద కోట్లు పెట్టిన ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ సర్కార్ అని విన్నవించారు. ఉద్యమ నేపథ్యంలో తనపై పెట్టిన కేసులపై 2006 నుంచి 2021 సంవత్సరం వరకు నాంపల్లి, సికింద్రాబాద్ సహా అనేక కోర్టులు తిరిగానని, ప్రస్తుతం కేసులన్నీ పూర్తయ్యాయని విప్ పేర్కొన్నారు. తనకు కోర్టులు, న్యాయవాదుల కష్టాలు, కోర్టుల్లో ఉండే వసతుల గురించి పూర్తి అవగాహన ఉందన్నారు. ఇతర సమస్యలను కూడా రాబోయే రోజుల్లో పరిష్కరించుకుందామని చెప్పారు. అడ్వకేట్లకు ప్రధానంగా ఒక కాలనీ, అందుకు సంబంధించి స్థలం, రెండోది మంచినీటి ట్యాంకు, షెడ్ అత్యవసరంగా పూర్తిచేసుకుందామని తెలిపారు. సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు సహకారంతో మరిన్ని నిధులు తీసుకువచ్చి సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్‌కు దీటుగా చెన్నూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేద్దామని పునరుద్ఘాటించారు. బార్డర్‌లో ఉండే నియోజకవర్గాలు గేట్‌వేస్ ఆఫ్ తెలంగాణ అని తెలిపారు. పొరుగున ఉన్న రాష్ట్రాల్లో కూడా ఇక్కడి అభివృద్ధిపై చర్చించుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు గౌడ్, చెన్నూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేశ్ గౌడ్, మంచిర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట సత్యనారాయణ, సీనియర్ న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు

- మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు



రాపల్లిలో డ్వాక్రా భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే దివాకర్ రావు

హాజీపూర్, అక్టోబర్ 5 : కులమతాలకు అతీతంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నదని ఎమ్మెల్యే దివాకర్ రావు పేర్కొన్నారు. గురువారం మండలంలోని రాపల్లి గ్రామంలోని పునరావాస కాలనీలో మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో డీఎంఎఫ్‌టీ నిధులు రూ.28 లక్షలతో నిర్మించిన అదనపు తరగతులను ప్రారంభించారు. ఎంపీపీ నిధులు రూ. 5 లక్షలతో నిర్మించనున్న డ్వాక్రా మహిళా భవన నిర్మాణానికి ఎంపీపీ మందపెల్లి స్వర్ణలత- శ్రీనివాస్, వైస్ ఎంపీపీ బేతు రమాదేవితో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా కులమతాలకు అతీతంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అన్ని మతాల పండుగలను గౌరవిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల చదువుకు పెద్ద పీట వేస్తుందని, విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను క్రమ శిక్షణతో విని భావిభారత పౌరులుగా ఎదగాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగేలా తల్లిదండ్రులకు వివరించాలన్నారు. గ్రామాల్లోకి వచ్చే పగటి వేషగాళ్లను నమ్మవద్దన్నారు. ఈ నెల 7న దొనబండ గ్రామ శివారులో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా పడ్తన్‌పల్లి లిఫ్ట్‌కు శంకుస్థాపన చేస్తామని, ప్రజలు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ లిఫ్టు ద్వారా మండలంలోని 8వేల ఎకరాలకు సాగునీరు అందనుందన్నారు. అనంతరం బతుకమ్మ చీరలు, క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. రాపల్లి సర్పంచ్ అనె మల్లేశం అధ్యక్షతన జరిగిన సమావేశంలో జడ్పీ కో ఆప్షన్ సభ్యులు నయీం పాషా, రాపల్లి వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులున్నారు.

# ఎన్ని కుట్రలు చేసినా..ప్రజలు నా వెంటే ఉన్నారు..

- భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా మూడో సారి గెలిపించాలి
- ఎన్నికల సమయంలో మాత్రమే వచ్చే వారిని నమ్మవద్దు
- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



కాసిపేట : సోమగూడెంలో ఐకేపీ భవనం పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

కాసిపేట, అక్టోబర్ 5 : ఎన్ని కుట్రలు చేసినా, అబండాలేసినా ప్రజలు తన వెంటనే ఉన్నారని, మూడో సారి కూడా గెలిపించాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కోరారు. గురువారం సోమగూడెం భరత్ కాలనీ గ్రామ పంచాయతీ సమీపంలో రూ.18 లక్షలతో మహిళా సంఘాల ఐకేపీ భవనం నిర్మాణానికి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య శంకుస్థాపన చేశారు. అనంతరం క్రీడాకారులకు క్రీడా కిట్లను పంపిణీ చేశారు. ముందుగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ కొరికొప్పుల ప్రమీలా గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడారు. లక్షల కోట్ల వ్యాపారులు మళ్లీ ఎన్నికల సమయంలో బెల్లంపల్లికి వస్తున్నారని, వారికి ఎన్నికలు వస్తారని ఎద్దేవా చేశారు. అలాంటి నమ్మవద్దని, ప్రజల మధ్య ఉంటున్న రైతు బిడ్డనైన నాకు ప్రజల అండగా ఉందన్నారు. ఇప్పటి వరకు అన్ని గ్రామాలను అభివృద్ధి చేశామని, మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. సోమగూడెంలో సింగరేణి స్థలాల్లో పట్టాలను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చానని, స్థానికంగా అందుబాటులో ఉండే మీ బిడ్డపైన నన్ను మరో సారి గెలిపించాలన్నారు. సీఎం కేసీఆర్‌కు ప్రజలకు ఏమి కావాలో తెలుసని, దాని మేరకే సంక్షేమ పథకాలు ఇస్తున్నారని, బీఆర్ఎస్ ప్రభుత్వానికి మరో సారి మద్దతు ఇచ్చి గెలిపించాలన్నారు. అనంతరం పలువురు ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ, సర్పంచ్ కొరికొప్పుల ప్రమీలాగౌడ్, మాజీ ఎంపీపీ పొట్లపల్లి సుభాష్‌రావు, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి కొమ్మెల లక్ష్మణ్, మండల అధ్యక్షుడు గణేశ్ గౌడ్, ఎంపీడీవో రాజేందర్, ఎంపీవో శ్రీనివాస్, గ్రామ అధ్యక్షురాలు ఊరగొండ జ్యోతి, వార్డు సభ్యులు జాడి ప్రమీలా, శంకర్ గౌడ్, కొరకొప్పుల రమ, చీమల శైలజ, ఎండీ సల్మా, బీఆర్ఎస్ యూత్ ఉపాధ్యక్షుడు రంగు రవి తేజ, దుర్గం గోపాల్, మాడ గోపాల్, కుక్క రాంచందర్, వొడ్నాల సత్యనారాయణ, జిల్లాల రాజేందర్, కార్యదర్శి రాయలింగు, యూత్ నాయకులు విజయ్, ఐకేపీ సీసీ రామకృష్ణ, పేరాల మహేశ్, సృజన, కారోబార్ ప్రేమ్, మహిళలు, గ్రామస్తులు, తదితరులున్నారు.

## చేతి వృత్తి దారుల ఆర్థిక సాధికారతే ధ్యేయం

బెల్లంపల్లి, అక్టోబర్ 5: చేతి వృత్తుల ఆర్థిక సాధికారతే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని బీఆర్ఎస్ బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తెలిపారు. పట్టణంలోని పోచమ్మ చెరువు పక్కన గంగపుత్ర సంఘ భవన నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. గంగపుత్రులకు ఉచితంగా చేపపిల్లల పంపిణీ, ఇతర సంక్షేమ, అభివృద్ధి పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నదని వెల్లడించారు. భవన నిర్మాణానికి రూ. 25లక్షలు నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గంగ పుత్ర సంఘం పట్టణ అధ్యక్షుడు దామెర కుమార స్వామి, నాయకులు బాసబోయిన పోతరాజు, దామెర సదానందం, కటుకూరి సత్యనారాయణ, వంగళ చక్రపాణి, కౌన్సిలర్ షేక్ ఆస్మా, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.